జీవనం దుర్భరం



బర్లపేటలో రోడ్డు లేని ఇళ్లు



ఇళ్ల ముందు నిలిచి పోయిన మురుగు నీరు



గుంతలో నుంచి మురుగు నీటిని బకెట్‌తో తోడుతున్న స్థానికుడు

- మురుగుకూపంలా బర్లపేట
- రోడ్లు, డ్రైనేజీల్లేక గ్రామస్తుల అవస్థలు
- ఇళ్ల ముందు, రోడ్డుపైనే వాడుక నీరు
- గోడు పట్టని పాలకులు, అధికారులు



డ్రైనేజీలు లేక ప్రధాన రోడ్డుపై నిలిచిపోయిన మురుగునీరు

పద్మనాభం: మండలంలోని పాండ్రంగి పంచాయతీ బర్లపేట వాసులు దుర్భర జీవనం గడుపుతున్నారు. డ్రైనేజీలు లేకపోవడంతో ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోవడంతో ఒకవైపు దుర్గంధం, మరోవైపు దోమలతో అవస్థలు పడుతున్నారు.

గుంతలు తవ్వి.. బకెట్‌తో తోడి..

కొంతమంది వాడుక నీరు పైకి వెళ్లకుండా ఇళ్ల వద్ద గుంతలు తవ్వుకుని దీనిలో నిల్వ చేస్తున్నారు. గుంతలు నిండిన తరవాత వీటిలోని మురికి నీటిని బకెట్లతో తోడి పైకి పార పోయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మురుగు కారణంగా ఈగలు, దోమలు వృద్ధి చెంది, ప్రజలకు రాత్రి వేళల్లో కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. డయేరియా, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వర్షాలకు ఆవాస ప్రాంతాలు చిత్తడిమయంగా తయారవడంతో మరింత ఇబ్బంది పడుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి తమ

రెండు సిమెంట్ రోడ్లు ఉన్నా..

గ్రామంలో సుమారు వందకు పైగా ఇళ్లున్నాయి. గ్రామంలో రెండు సిమెంటు రోడ్లు ఉన్నా వీటికిరువైపులా డ్రైనేజీలు లేకపోవడంతో మురికి నీరు ఎక్కడికక్కడే నిలిచిపోతుంది. గ్రామం ప్రవేశంలో సిమెంటు రోడ్డు ఉంది. దీనికి గతంలో ఒక పక్క సిమెంటు రోడ్డు వేశారు. ఇది పూర్తిగా పూడుకు పోయింది. గతంలో దీన్ని అవసరం లేని చోట నిర్మించారు. దీని వల్ల ఇళ్లలోని వాడుక నీరు ఈ రోడ్డు మీదకు వచ్చి నిలిచి పోవడంతో మురికి నీటిలో నడిచి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామంలో ఇంకెక్కడా సైడు కాలువలు, సిమెంటు రోడ్లు లేవు. ఇళ్లలోని వాడుక నీరు వెళ్లేందుకు దారి లేకపోవడంతో ఇంటి ముంగిట నిలిచిపోయి నివాస ప్రాంతాలు మురుగుకూపాలుగా మారాయి.

మురుగులోంచే ఇళ్లలోకి వెళ్లాలి



డ్రైనేజీలు లేకపోవడంతో ఇళ్లలోని వాడుక నీరు పైకి వచ్చి ఇంటి ముంగిట నిలిచి పోతోంది. దీని వల్ల మురుగు నీటిని మట్టుకుని ఇంటిలోకి వెళ్లాల్సి వస్తోంది. కొంతమంది ఇళ్ల వద్ద గుంతలు తవ్వుకున్నారు. వాడుక నీరు ఇంటి ముందు నిలిచి పోకుండా గుంతల్లోకి మళ్లిస్తున్నాం. గుంతలు నిండి పోగానే బకెట్లతో మురికి నీటిని తోడి పైకి పారబోస్తున్నాం.

– పి.సూరప్పుడు, బర్లపేట

వాన పడితే నరకమే..



అసలే మురుగు ఇళ్లముందు నిలిచిపోయి ఇబ్బంది పడుతున్నాం. ఇక వర్షం పడిందంటే మా పరిస్థితి నరకాన్ని తలపిస్తుంది. వర్షపు నీటికి ఇళ్లన్నీ చిత్తడిగా మారుతున్నాయి. మట్టి రోడ్లు ఉండడంతో బురదగా ఉంటోంది.సైడు కాలువలు లేకపోవడంతో ఈ బురదకు ఇళ్లలోని వాడుక నీరు తోడవడంతో ఇళ్లలో ఉండలేకపోతున్నాం.

– పి.నారాయణమ్మ, బర్లపేట

క్లుప్తంగా

25న జీడిమామిడి పిక్కల సేకరణకు బహిరంగ వేలం

తగరపువలస: విశాఖ అటవీశాఖ డివిజన్‌లో జీడి మామిడి పిక్కల సేకరణ, నిల్వకు గాను ఈ నెల 25న బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు జిల్లా అటవీశాఖ ఓ ప్రకటన పేర్కొంది. పీఎంపాలెం సమీపంలోని లా కళాశాల ఎదురుగా కంబాల కొండ టీడీసీ వద్ద ఉదయం 11 గంటలకు వేలం నిర్వహిస్తారు. అలాగే అమ్మకం కాని యూనిట్లకు సంబంధించి ఫిబ్రవరి 8, 18 తేదీలలో అదే స్థలంలో ఉదయం 11 గంటలకు వేలం నిర్వహించనున్నారు. అటవీశాఖ పరిధిలోని దువ్వాడలో 400, కొవ్వాడలో 14, చిననాగమయ్యపాలెంలో 2,120 చెట్లు ఉన్నట్టు తెలిపారు. మిగిలిన వివరాలకు కార్యాలయ పనివేళల్లో 0891-2563784, 9440810034, 9440810194 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

29 నుంచి గీతంలో ‘ఎక్సలెన్స్ మీట్-2025’

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం బిజినెస్ స్కూల్ వేదికగా ఈ నెల 29 నుంచి మూడు రోజుల పాటు ఎక్సెలెన్స్ మీట్ - 2025 నిర్వహించనున్నామని బిజినెస్ స్కూల్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు తెలిపారు. కార్యక్రమ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ స్థాయిలో నిర్వహించనున్న మీట్ విద్యార్థుల ప్రతిభకు వేదికగా మారనున్నట్లు తెలిపారు. యువతలో నాయకత్వ లక్షణాలు బలోపేతం చేయడం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ డా.కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

వలకు చిక్కిన తాబేళ్లు



మత్స్యకార వలకు చిక్కిన తాబేళ్లు

కొమ్మాది: మత్స్యకారుల వలలో తాబేళ్లు చిక్కుకున్నాయి. రుషికొండ బీచ్‌లో మంగళవారం ఉదయం వేటకు వెళ్లిన స్థానిక మత్స్యకారులకు వల బరువుగా, నిండుగా మారడంతో చేపలు బాగా పడ్డాయని ఎంతో సంబరపడ్డారు. వలను జాగ్రత్తగా తీరానికి తీసుకువచ్చి చూసేసరికి ఏకంగా 8 తాబేళ్లు, కొన్ని చేపలు, కొన్ని సముద్రపు పాములు కనిపించాయి. దీంతో మత్స్యకారులు కాస్త నిరాశకు గురైనా, తాబేళ్లను మళ్లీ సముద్రంలో సురక్షితంగా విడిచిపెట్టారు.

రైతులకు సబ్సిడీపై పైపులు



మాట్లాడుతున్న ఏడీ విజయ్ ప్రసాద్

పద్మనాభం: రైతులకు సబ్సిడీపై నల్ల పైపులు ఇవ్వనున్నట్లు భీమునిపట్నం సబ్ డివిజన్ వ్యవసాయ అసిస్టెంట్ డైరెక్టర్ బి.విజయ్ ప్రసాద్ తెలిపారు. పైపులు కావల్సిన వారు ఉద్యానవన శాఖ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. మండలంలోని పెంట గ్రామంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాండ్రంగి, కృష్ణాపురం, విలాస్కాన్‌పాలెం గ్రామాల రైతు సేవా కేంద్రాల్లో డీఏపీ అందుబాటులో ఉందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి ఎంవీఎస్ చలం, సర్పంచ్ బోదల పావని, ఉప సర్పంచ్ నానాజీ, పశు సంవర్ధక శాఖ గ్రామ సహాయకుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

జాతీయ కాపు సంఘంలో నాగేశ్వరరావుకు పదవి



మీసాల నాగేశ్వరరావు

తగరపువలస: కాపు సంఘం జాతీయ రైతు విభాగం ప్రధాన కార్యదర్శిగా ఆనందపురానికి చెందిన మీసాల నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ కాపు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కర్ణ మురళీకృష్ణ నాయుడు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు

తగరపువలస: నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా తాను అండగా నిలబడతానని పార్టీ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు భరోసా ఇచ్చారు. సంగివలసలోని ఒకటో వార్డు కార్పొరేటర్ అక్కరమాని పద్మ, రామునాయుడు గృహానికి మంగళవారం విచ్చేసిన ఆయన కుటుంబ సభ్యులతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలను కలుసుకున్నారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిని చేసుకునేందుకు రాష్ట్ర ప్రజలు తహతహలాడుతున్నారన్నారు. ప్రస్తుత పాలనలో ఆయన అవసరం ప్రజలకు తెలిసిందన్నారు. త్వరలో అందరితో మరోమారు సమావేశమవుతాయని తెలిపారు. ఈ సందర్భంగా 1,2,3 వార్డుల నాయకులతో పాటు భీమిలి మండల నాయకులు ఆయనను అభినందించారు.



సంగివలసలో కార్పొరేటర్ అక్కరమాని పద్మ, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో మజ్జి శ్రీనివాసరావు

కార్యక్రమంలో దాట్ల పెదబాబు, ఎంపీపీ దంతులూరి వాసురాజు, వైస్ ఎంపీపీ బోని బంగారు నాయుడు, మాజీ కౌన్సిలర్లు, కార్మిక సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

గజమాలలతో సత్కారం

విజయనగరంలోని ధర్మపురి వద్ద సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు ఇంటికి వైఎస్సార్‌సీపీ భీమిలి జోన్ రెండోవార్డు ఇన్‌చార్జి శిల్లా సరళారాణి, కరుణాకరరెడ్డి, జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి



శ్రీనివాసరావుకు ఆయన ఇంటి వద్ద గజమాల వేస్తున్న రెండోవార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి శిల్లా సరళారాణి

ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు వెళ్లారు. ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి, గజమాలతో సత్కరించారు.

- ఒకటో వార్డు అధ్యక్షుడు జగుపల్లి ప్రసాద్, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు తదితరులు మజ్జి శ్రీనివాసరావును శాలువాతో సత్కరించారు.
- రెండో వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అక్కరమాని మంగరాజు మజ్జి శ్రీనివాసరావును గజమాలతో సన్మానించారు.

ఏఎంసీ మాజీ చైర్మన్ యలమంచిలికి పరామర్శ

తగరపువలస: ఇటీవల అస్వస్థత కారణంగా ఇంటికే పరిమితమైన భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణను వైఎస్సార్ సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు మంగళవారం పరామర్శించారు. గొల్లల తాళ్లవలసలోని ఆయన ఇంటికి వెళ్లి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని తిరిగి పార్టీలో సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మండలం, పంచాయతీలోని ముఖ్య నాయకులు, వార్డు సభ్యులను చిన్న శ్రీనుకు పరిచయం చేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు దాట్ల పెదబాబు, భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, మాజీ కౌన్సిలర్ కదిరి ఎల్లాజీ, ఎంపీటీసీ



సూర్యనారాయణను పరామర్శిస్తున్న సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు

సభ్యుడు చెల్లూరి నగేష్, పొట్నూరు చంద్రశేఖర్, బొడ్డు దుర్గారావు, అక్కరమాని అప్పలనాయుడు, రమణ, పిన్నింటి ఎర్రయ్యరెడ్డి, కోండ్రు రామసూరప్పడు, గుండాసి మధునాయుడు, యలమంచిలి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కౌమారులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

పద్మనాభం: కౌమార దశలో ఉన్న వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ సూచించారు. కిశోరి వికాసంపై సచివాలయం ఏఎన్ఎం, మహిళా పోలీసులు, హైస్కూల్ నోడల్ ఆఫీసర్లకు వెలుగు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఒక రోజు శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిది నుంచి 19 ఏళ్ల లోపు గల వారు కౌమార దశలోకి వస్తారని తెలిపారు. మానవ జీవితంలో కౌమార దశ అత్యంత ప్రధానమైనదన్నారు. దేశ జనాభా, ఆర్థికాభివృద్ధి, లింగ సమానత్వం, సామాజిక సామరస్యం, ప్రజల జీవన ప్రమాణాల పెంపుదల వంటి సాంఘిక అభివృద్ధి అంశాల నిర్ధారణలో కౌమార దశ ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. ఈ సమయంలో



మాట్లాడుతున్న ఎంపీడీవో విజయ్ కుమార్

వారు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో జయ ఉమ, రేవిడి పీహెచ్‌సీ వైద్యాధికారి స్వప్న, ఏఎస్ఐ ఎన్.శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఉమా జానకి, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

రాసపోలమాంబకు విశేష పుష్పాలంకరణ



చామంతి, బంతిపూల అలంకరణలో అమ్మవారు

తగరపువలస: పసుపు, తెలుపు, నీలం చామంతులు, ఎర్ర బంతిపువ్వుల మాలలతో విశేష అలంకరణలో రాసపోలమాంబ అమ్మవారు దర్శనమిచ్చారు. భీమిలి మండలం మజ్జివలస గ్రామ దేవత అయిన అమ్మవారిని ఆలయ కమిటీ ప్రతినిధులు మంగళవారం ప్రత్యేకంగా అలంకరించారు. ఈ అలంకరణకు గాజువాకకు చెందిన బస కుమార్, మధులత, వరలక్ష్మి సహకారం అందించారు. భక్తులకు తుపాకుల అప్పల రాసయ్య, రాసమ్మ దంపతులు ప్రసాదాలు పంపిణీ చేశారు.

సమన్వయంతో శతాబ్ది ఉత్సవాలు

ఎమ్మెల్యే గంటా, కలెక్టర్ హరేందిర ప్రసాద్

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాలను సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఉత్సవాల నిర్వహణకు అన్నివిధాలా సహకారం అందిస్తానన్నారు. ఫిబ్రవరి మొదటి వారంలో నిర్వహించనున్న శతాబ్ది ఉత్సవాల నేపథ్యంలో పాఠశాల వద్ద ఉత్సవ నిర్వహణ కమిటీతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్సవాలను పండగ వాతావరణంలో నిర్వహించాలన్నారు. కార్యక్రమం రెండు రోజులపాటు నిర్వహించాలని భావిస్తున్నారని, అది రెండు రోజులా లేక ఒకరోజా అన్నది త్వరలోనే నిర్ణయించి, తెలియజేయాలన్నారు. కలెక్టర్ హరేందిర ప్రసాద్ మాట్లాడుతూ పాఠశాలకు ఎంతో ప్రాధాన్యం ఉంది కాబట్టి అదేస్థాయిలో ఉత్సవం జరగాలన్నారు. దీనికి అవసరమైన అన్ని



ఉత్సవ లోగోను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా, కలెక్టర్ హరేందిరప్రసాద్ తదితరులు

ఏర్పాట్లు జాగ్రత్తగా చేయాలని, వీలైనంత వరకు పూర్వ విద్యార్థులు వచ్చేలా చూడాలన్నారు. ఇక్కడ అందరి సహకారాన్ని తీసుకుని కార్యక్రమం నిర్వహించాలన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్, జోనల్ కమిషనర్ ప్రేమప్రసన్న వాణి, తహసీల్దారు రామారావు, మండల విద్యాశాఖ అధికారి శివరాణి, కార్పొరేటర్ గంటా అప్పలకొండ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల సత్వర పరిష్కారానికే వేదిక

తగరపువలస: విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారానికే వేదిక నిర్వహిస్తున్నామని వేదిక చైర్మన్ డాక్టర్ బి.సత్యనారాయణ తెలిపారు. ఆనందపురం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలో ఆయన మాట్లాడారు. నిర్ణీత కాల వ్యవధిలో విద్యుత్ వినియోగదారుల సమస్యలను సిబ్బంది నిర్లక్ష్యంతో పరిష్కరించకుంటే ఈ న్యాయస్థానాన్ని (వేదికను) ఆశ్రయించవచ్చన్నారు. దీంతో న్యాయస్థానం ఇరువురి వాదనలు విని, సమస్య పరిష్కారంలో జాప్యం జరిగితే పరిహారం ఇప్పించేందుకు కృషి చేస్తుందన్నారు. బిల్లింగ్‌లో లోపాలు, విద్యుత్ కేబుల్ మరమ్మతులు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులతో పాటు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, మీటర్లు కాలిపోవడం, ఓల్టేజీ హెచ్చుతగ్గులు, విద్యుత్ మీటర్ల లోపాలు, కొత్త సర్వీసులు, అదనపు లోడు మంజూరు, యజమాని పేరు, కేటగిరీ మార్పిడి, వినియోగదారుల బిల్లులలో లోపాలు సరిచేయడం, బిల్లులు



పరిష్కార వేదిక ప్రతినిధులకు సమస్యలు వివరిస్తున్న ఆనందపురం రైతులు

చెల్లింపు తరువాత సరఫరా పునరుద్ధరణ కాకపోవడం వంటి సమస్యలపై న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చన్నారు. వినియోగదారులు తమ సమస్యలను సీతమ్మధారలోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం లేదా విజయవాడలోని విద్యుత్ అంబుడ్స్‌మన్‌కు లిఖితపూర్వకంగా లేదా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు సమర్పించవచ్చన్నారు. దీనికి ఎలాంటి ఫీజులు, లాయర్ ఖర్చులు ఉండవని తెలిపారు. వేదికలో సభ్యులు షేక్ బాబర్, మసిలామణి, ఎన్.మురళీకృష్ణ, ఏపీఈపీడీసీఎల్ ఈఈ పి.శ్రీనివాసరావు, ఏఈఈ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన రిజిస్ట్రేషన్లు



మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

మధురవాడ: మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మంగళవారం ఒకే ఒక్క రిజిస్ట్రేషన్ మాత్రమే అయింది. సర్వర్ పని చేయకపోవడంతో రిజిస్ట్రేషన్లు స్తంభించిపోయాయి. జిల్లా అంతా దాదాపు ఇదే పరిస్థితి తలెత్తింది. ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి కార్యాలయాలకు వచ్చిన వందలాది మంది సాయంత్రం వరకు నిరీక్షించి, నిరాశగా వెనుతిరిగారు.

తాబేళ్ల సంరక్షణ కేంద్రాల ఏర్పాటు

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు, సాగర్‌నగర్,జోడుగుళ్లపాలెం,చేపలుప్పాడ బీచ్ వద్ద అటవీ శాఖ ఆధ్వర్యంలో తాబేళ్ల సంరక్షణా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఏటా తాబేళ్లు తీరానికి చేరుకుని గుడ్లు పెడతాయి. వీటిని సేకరించి సంరక్షణ కేంద్రాల్లో భద్రపరుస్తారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో సిబ్బంది గుడ్లు సేకరించి భద్రపరుస్తారు. తాబేళ్ల గుడ్లను తొలుత తడి ఇసుక వేసి ఆ తరువాత రెండు పొరలుగా పొడి ఇసుక వేస్తారు. 40-45 రోజులు గడిచాక వేడికి గుడ్లు పొదిగి పిల్లలు బయటకు వస్తాయి. సముద్రంలో విడిచిపెట్టే ముందురోజు సాయంత్రం ట్రేలలో, గంపల్లో ఉంచుతారు. అవి



సాగర్‌నగర్‌లో ఏర్పాటు చేస్తున్న తాబేళ్ల సంరక్షణ కేంద్రం

ఉత్సాహంగా తిరిగి శక్తి సామర్థ్యాలను సంతరించుకునే వాతావరణం కల్పిస్తారు. మరుసటి రోజు సూర్యోదయం వేళ సముద్రంలోకి విడిచిపెడతారు.

453 పశువులకు నట్టల నివారణ మందులు

తగరపువలస: ఆనందపురం మండలం గిడిజాలలో పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మంగళవారం 453 పశువులు, జీవాలకు నట్టల నివారణ మందులు అందించారు. ముందుగా ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ షిణగం అప్పలరాజు, వైస్ ఎంపీపీ పాండ్రంగి శ్రీను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్యులు, సిబ్బంది పశువులకు పరీక్షలు నిర్వహించారు.



పోస్టర్ విడుదల చేస్తున్న వైస్ ఎంపీపీ శ్రీను, సర్పంచ్ అప్పలరాజు

గ్రావెల్ తవ్వకాలు, తరలింపుపై జేసీకి ఫిర్యాదు

తగరపువలస: ఆనందపురం మండలం తర్లువాడ సర్వే నంబర్ 166లో ప్రభుత్వ అనుమతి లేకుండా తవ్వకాలు జరిపి గ్రావెల్ తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పెద్దిపాలెం పంచాయతీకి చెందిన శ్రీనివాసరావు అనే వ్యక్తి జాయింట్ కలెక్టర్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. పెద్దిపాలెం, తర్లువాడ వద్ద నగరపాలెం గ్రామాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు ఐదు లారీలు, రెండు జేసీబీలు, రెండు పొక్లెయినర్లతో గ్రావెల్ తరలిస్తున్నట్టు వాహనాల నంబర్లను ఫిర్యాదులో పేర్కొన్నారు. 20 ఎకరాలలో 50 అడుగుల లోతు గోతులు



తర్లువాడ సర్వే నంబర్ 166లో తవ్వకాలు జరిగిన ప్రదేశం

పెట్టి గ్రావెల్ తవ్వినట్టు ఆరోపించారు. అంతేకాకుండా తవ్విన గ్రావెల్‌ను పెద్దిపాలెంలోని సబ్బుల ఫ్యాక్టరీ గొడౌన్ వద్ద 3.50 ఎకరాలలో కొత్తగా నిర్మించ తలపెట్టిన అపార్ట్‌మెంట్ల కోసం 8 అడుగుల గోతులను పూడుస్తున్నారని పేర్కొన్నారు. అలాగే గుడిలోవలో కొత్తగా నిర్మిస్తున్న లే అవుట్ కోసం గెడ్డను కప్పేశారన్నారు. గ్రావెల్ తవ్వినచోట అక్రమంగా బహుళ అంతస్తుల భవనాలు నిర్మించ తలపెట్టారని తెలియజేశారు. ఈ అక్రమాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఫిర్యాది శ్రీనివాసరావు కోరారు.

భూసార స్థితిగతులపై విద్యార్థులకు అవగాహన



భూసార పరీక్షలకు హాజరైన విద్యార్థులు

తగరపువలస: కేంద్ర ప్రభుత్వ వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రాంలో భాగంగా స్టేట్ రన్ కార్యక్రమానికి జిల్లాలోని భీమిలి మండలం లక్ష్మీపురం జెడ్పీహైస్కూల్‌ను ఎంపిక చేశారు. ఇందులో భాగంగా రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ హరికృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులకు భూసార స్థితిగతులపై మంగళవారం అవగాహన కల్పించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఏడీఏ వారితో మాట్లాడారు. పంటలు సాగు చేయడానికి మట్టిలో ఉండవలసిన పోషకాలు సమపాళ్లలో ఉన్నాయా లేదా తెలుసుకోవాలంటే భూసార పరీక్షలు తప్పనిసరి అని తెలియజేశారు. మట్టి నమూనాల సేకరణ, ఆన్‌లైన్‌లో పొందుపరచడం ప్రత్యక్షంగా విద్యార్థులతో చేసి చూపించారు. కార్యక్రమంలో సంచార భూసార పరీక్షా విభాగం సంచాలకుడు టి.దాసు, వ్యవసాయాధికారులు శివ కోమలి,సురేష్, ఎల్.హరీష్, రమేష్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.